Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శుక్రవారం 14/08/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## జానపద కళకు అరుదైన గౌరవం



● రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం

**టి మీడియా, ఆగస్టు 13, పెద్దపల్లి:**
తెలంగాణ జానపద కళకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన జానపద కడ్డీ తంత్రి కళాకారుడు దుర్శేటి రామయ్య కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారానికి ఎంపికయ్యారు. జానపద సంగీత విభాగంలో తెలంగాణ నుంచి ఆయనకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది.న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రామయ్య అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి సత్కరించారు. తెలంగాణ జానపద సంగీతాన్ని, కడ్డీ తంత్రి కళను రామయ్య ఎన్నో ఏళ్లుగా కాపాడుతూ, భావితరాలకు పరిచయం చేస్తూ వస్తున్నారు.రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ పురస్కారం అందుకోవడం గర్రెపల్లి గ్రామానికి ప్రత్యేక గౌరవంగా నిలిచింది. తమ గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన రామయ్యను గ్రామస్తులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ జానపద కళలకు మరింత ప్రాచుర్యం తీసుకురావడంలో ఈ పురస్కారం స్ఫూర్తిగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

# భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతి

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**టి మీడియా, ఆగస్టు 13, అమరావతి:**
నాటికి భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 190 కిలోమీటర్ల అవుటర్, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగురోడ్డును కూడా కేంద్రం మంజూరు చేసిందన్నారు. సింధూ నాగరికత తరహాలోనే రాజధాని నగరంలో సీడ్ యాక్సెస్ రహదారులు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. 2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నామన్న సీఎం, మరి మీరు ఏం సంకల్పం చేస్తారని ప్రశ్నించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయాలని సూచించారు.

**ప్రజా ఉద్యమంగా తిరంగ ర్యాలీ**

అనునిత్యం ప్రజల సంకల్పాన్ని నెరవేర్చుకునే ఆలోచనలు చేస్తే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. మనకు స్వాతంత్ర్యం ఎందుకు వచ్చిందో అంతా మర్చిపోతున్నామని అన్నారు. కేవలం జెండా వందనం ఒక్కటే కాదు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టటం ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులు, విద్యార్థులు, కార్మికులు, (మిగతా 2లో)

# పేదల రుణం తీర్చుకునే అవకాశం



● ఇందిరమ్మ ఇళ్లకి సీఎం భూమిపూజ
● పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా



**టి మీడియా, ఆగస్టు 13,హైదరాబాద్ బ్యూరో:**
గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్?, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. హైదరాబాద్? నగరంలోని కేపీహెచ్?బీ కాలనీలో క్యూర్? పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. పేదల రుణం తీర్చుకునేందుకు అవకాశం వచ్చిందని, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్? పార్టీ నేతలపై రేవంత్ రెడ్డి పలు విమర్శలు గుప్పించారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారని మండిపడ్డారు.పేదల సొంతింటి కలను నెరవేరుస్తా : పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు అండగా ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించామని వివరించారు. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ లోన్లు అందించామని తెలిపారు. మహిళలకు (మిగతా 3లో)

## 5వేల మంది పైలట్లకు డ్రగ్ టెస్టులు

**సడెన్‌గా ఎందుకంటే?**

**టీ మీడియా, ఆగస్ట్13, ఢిల్లీ బ్యూరో :**
ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్?ప్రెస్ సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. రెండు సంస్థల్లో పనిచేస్తున్న పైలట్లందరికీ సైకోఆక్టివ్ పదార్థాల పరీక్షలు నిర్వహించనున్నాయి. ఇటీవల పుకెట్– ఢిల్లీ విమానం అకస్మాత్తుగా సుమారు 300 అడుగులు కిందకు పడ్డ ఘటనలో విమాన సిబ్బందిలోని పైలట్?కు నిర్వహించిన నిర్ధరణ పరీక్షలో గంజాయ్ పాజిటివ్?గా తేలింది. ఆ నేపథ్యంలోనే రెండు సంస్థలు నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు గురువారం తెలిపాయి.అయితే టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఆ రెండు విమానయాన సంస్థల్లో కలిపి 5000 మందికిపైగా పైలట్లు ఉన్నారు. వారందరికీ (మిగతా 2లో)

## పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ములో ఏజెన్సీల అక్రమాలు

● ఎగవేతలు రూ.1000 కోట్లకు పైనే

**టి మీడియా, ఆగస్టు 13, హైదరాబాద్ బ్యూరో:**
తెలంగాణ ప్రభుత్వంలో పొరుగు సేవల విధానంలో పని చేస్తున్న ఉద్యోగుల తరపున పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము చెల్లించకుండా నియామక ప్రైవేట్ ఏజెన్సీలు పెద్ద ఎత్తున అక్రమాలకు తెరలేపాయి. ఈ సొమ్ము ఎగవేతలు రూ.వెయ్యి కోట్లకు పైగానే ఉన్నట్లు ప్రాథమిక విచారణలో సర్కారు గుర్తించింది. పూర్తిస్థాయి విచారణ కొనసాగుతున్నందున ఇంకా ఎంత ఉంటుందో ఇప్పుడే చెప్పలేమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఉద్యోగుల జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము చెల్లింపు వివరాలన్నీ ఇవ్వాలని ఆర్థిక శాఖ అడగటంతో ఈ ఎగవేతల ముచ్చట బయటపడింది. వివిధ శాఖలు, సంస్థలు, విభాగాల్లో పొరుగుసేవల విధానంలో ప్రస్తుతం రాష్ట్రంలో 1.60 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. నెలకు రూ.352 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లిస్తున్నా, వాటి వినియోగం లెక్కల వివరాలను మాత్రం గతంలో తీసుకోలేదు.

**వివరాలే లేవంటున్న శాఖలు**

సాధారణంగా ప్రైవేటు ఏజెన్సీలు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నేరుగా (మిగతా 2లో)






## పార్లమెంట్‌లో పోటాపోటీ నిరసనలు

**ఉభయసభలు నిరవధిక వాయిదా**



**టి మీడియా, ఆగస్టు 13, ఢిల్లీ బ్యూరో :**
జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గందరగోళం మధ్య ముగిశాయి. గురువారం ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే నిరవధిక వాయిదా వేశాయి. సమావేశాల ముగింపు కూడా అధికార, విపక్షాల మధ్య తీవ్ర రాజకీయ ఘర్షణకు వేదికగా మారింది. పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద బీజేపీ, ప్రతిపక్ష ఎంపీలు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు.గురువారం ఉదయం లోక్?సభ ప్రారంభం కాగానే జాతీయ గీతం వందేమాతరంలోని మొత్తం 6 చరణాలను ఆలపించారు. ఆ వెంటనే సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా సమావేశాలు ముగిసే రోజున సభ పనితీరును, ఉత్పాదకతను వివరిస్తూ స్పీకర్ చేసే ముగింపు ప్రసంగం ఈసారి జరగలేదు. సభ వాయిదా పడిన సమయంలో ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభలో కొద్దిసేపు ఉన్నారు.

**వరుస అంతరాయాలతోనే సమావేశాలు**

ఈసారి వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభలో తరచూ కార్యకలాపాలకు (మిగతా 2లో)

## మంత్రి తుమ్మల అరుదైన రికార్డు

● 21సార్లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జండా ఆవిష్కరణ
● 4 ప్రభుత్వాల సాక్షిగా ఒకే గౌరవం



**టి మీడియా, ఆగస్టు 13,హైదరాబాద్:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో అరుదైన రికార్డు ఒకటి ఇప్పుడు తెలంగాణ వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరిట లిఖితం కానుంది. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన అరుదైన రికార్డును ఆయన సొంతం చేసుకున్నారు. ప్రజాస్వామ్యంలో దేశంలో రాజకీయాల్లో పార్టీలు మారతాయి... ప్రభుత్వాలు మారతాయి... కానీ ఒక నేత పట్ల ప్రజావిశ్వాసం మాత్రం చెక్కుచెదరలేదు! తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విషయంలో ఇది అక్షర సత్యం. ఈ నేపథ్యంలోనే స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణ చేసే గౌరవం వరుసగా ఆయనకే దక్కుతూ వస్తోంది. ఇప్పటికే 20సార్లు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న తుమ్మల, ఈనెల 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21వసారి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇదొక సరికొత్త ఘట్టంగా నిలవనుంది.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేయడం ప్రతి నేతకూ లభించే గౌరవం. అలాంటి అరుదైన అవకాశం తుమ్మలకు ఏకంగా 20 సార్లు దక్కడం, ఈనెల 15న 21వ సారి దక్కనుండటం విశేషం.

**నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు**

1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలోనే మంత్రి పదవి చేపట్టారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన, ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా వ్యవహరించారు. మైనర్ ఇరిగేషన్, రోడ్లు-భవనాలు, ప్రొహిబిషన్-ఎక్సైజ్, మేజర్-మైనర్ ఇరిగేషన్ వంటి కీలక శాఖలను నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ, సహకార, జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

**ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా**

రాజకీయ ప్రస్థానంలో తుమ్మల ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఈ సుదీర్ఘ ప్రజాజీవితంలో మంత్రిగా ఉన్న దాదాపు ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ చేసిన ఘనత ఆయనది. వేర్వేరు (మిగతా 2లో)

## కూలిపోయిన టన్నెల్ (మిగతా 2లో)

# ఇంద్రకీలాద్రిపై రికార్డు స్థాయిలో ఆషాఢం సారె



● నెల రోజుల్లో ఆరు లక్షల మంది

**టి మీడియా, ఆగస్టు 13, విజయవాడ :**
విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువదీరిన అమ్మవారికి నెల రోజుల్లో రికార్డు స్థాయిలో ఆరు లక్షల మందికి పైగా తరలివచ్చి ఆషాఢం సారెను సమర్పించారు. గత దశాబ్ద కాలంలో ఆల్‌టైమ్ రికార్డు ఇది. ఏపీ, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, 4 రాష్ట్రాల నుంచి ఈసారి సారెను సమర్పించేందుకు వందల భక్త బృందాలు తరలివచ్చాయి. భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసిన అధికారులు దానికి తగ్గట్లుగా పక్కాగా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో అత్యంత వైభవంగా సారె వేడుకలను నిర్వహించగలిగారు. జులై 15 నుంచి ఆరంభమైన ఆషాఢం మాసం సారె సమర్పణ మహోత్సవాలు ఆగస్టు 12తో ముగిశాయి. భక్తులు భారీగా తరలిరావడంతో ఇంద్రకీలాద్రి క్షేత్రం భక్తజన ప్రవాహంతో నిండిపోయింది. చివరి రోజు బుధవారం దేవస్థానం సిబ్బంది తరఫున ముగింపు సారెను ఆలయ ఈవో వి.కె.శీనానాయక్, పాలక మండలి ఛైర్మన బొర్రా రాధాకృష్ణ ఆధ్వర్యంలో సమర్పించారు.

**తరలివచ్చిన భక్తులు:**
అమ్మవారికి సారెను సమర్పించడానికి ఈసారి భక్తులు పోటీపడ్డారు. గ్రామాలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లు, కుల, ఉద్యోగ సంఘాలు, అధికారులు, రాజకీయ నాయకులు ఇలా ఎవరికి వారు బృందాలుగా ఏర్పడి సారె తీసుకొచ్చారు. రోజూ కనీసం 20 నుంచి 30 బృందాలు ఆలయానికి వచ్చేవి. కొన్ని బృందాల్లో నాలుగైదు వేల మంది భక్తులు ఉన్నారు.తొలిసారి రిజిస్ట్రేషన్ విధానం: సారె బృందాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను తొలిసారి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం సత్ఫలితాలు ఇచ్చింది. సారె తీసుకొచ్చే బృందాలు ముందుగానే దేవస్థానం టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఎంత మంది వస్తున్నారో చెప్పి రిజిస్ట్రేషన్ చేసుకునే వాళ్లు. అనంతరం వారికి ఏ సమయంలో రావాలో కచ్చితమైన టైమ్ స్లాట్‌ను దేవస్థానం కేటాయించింది. దీంతో వాళ్లు రాగానే సారెను సమర్పించడం, అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం, అన్నదానం ఏర్పాటు చేశారు.

**పక్కా నిర్వహణ**
ముందుగానే ఎంతమంది వస్తున్నారనే సమాచారం తెలియడంతో వారిని ఏ మార్గంలో తీసుకెళ్లాలి, దర్శనం ఏర్పాట్లు, వృద్ధులు, దివ్యాంగులను లిఫ్ట్‌లో తీసుకెళ్లడం ఇలా పక్కాగా నిర్వహణ విషయంలో ఏర్పాట్లు చేయడంతో విజయవంతంగా వేడుకలు ముగిశాయని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ వెల్లడించారు.

# భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతి

(మొదటి పేజీ తరువాయి)
వ్యాపారులు ఎవరైనా తమ ప్రాంతాల్లో కృషి చేయాలని కోరారు. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలన్నారు. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఓ ప్రజా ఉద్యమంగా తిరంగ ర్యాలీ జరగాలని, వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్?గా తయారు కావాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

**మొదటి మెట్టు ఎక్కాం**
2047 నాటికి స్వర్ణాంధ్రగా ఏపీ తయారు కావాలని, ఆ శక్తి సామర్థ్యాలను ప్రజలే అందించాలని కోరారు. అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. అమరావతి ఆర్థిక రాజధానిగా మారాలి. స్వాంతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని ప్రజలంతా అందిపుచ్చుకోవాలన్నారు. సీడ్ యాక్సెస్ రహదారి, స్టీల్ బ్రిడ్జిలతో మొదటి మెట్టు ఎక్కామని చంద్రబాబు వెల్లడించారు. రాజధాని అమరావతికి రాజమార్గంగా చెబుతున్న సీడ్ యాక్సెస్ రహదారి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అమరావతి రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలవనున్న జు-3 సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు.

# పార్లమెంట్‌లో పోటాపోటీ నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)
అంతరాయం ఏర్పడింది. అధికార, విపక్షాల ఆందోళనలతో దద్దరిల్లాయి. నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై లాఠీచార్జ్, అయోధ్య విరాళాల చోరీ వంటి అంశాలపై నిరసిస్తూ ప్రతిపక్షాలు సభను అడ్డుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులపై లాఠీచార్జ్ ఘటనపై హోంమంత్రి అమిత్ షా జవాబు చెప్పాలని విపక్షాలు చేసిన డిమాండ్ సభను కుదిపేసింది. మరోవైపు ఝార్ఖండ్? నిరసనలపై రాహుల్ గాంధీ స్పందించాలంటూ బీజేపీ ఎంపీలు నిరసనలు చేశారు. సభ లోపలే కాకుండా పార్లమెంట్ ప్రాంగణంలోనూ ఇరు పక్షాలు పరస్పర నిరసనలకు దిగాయి. చివరి రోజు కూడా అదే పరిస్థితి కొనసాగడంతో సభలు నిరవధిక వాయిదా వేశారు. దీంతో చర్చలు, రాజకీయ ఆరోపణలు, నిరసనల మధ్య సాగిన వర్షాకాల సమావేశాలకు అధికారికంగా తెరపడింది.

అయితే గురువారం చివరిరోజు కావడంతో అమిత్‌షా ఈ అంశంపై సమాధానం చెబుతారని అంతా భావించారు. ఆయన కూడా విపక్షాల ప్రతీ ప్రశ్నకూ సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు బుధవారం ప్రకటించారు. అందుకు సమయం కేటాయించాలని స్పీకర్‌ను సైతం కోరారు. అయినప్పటికీ, సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

# మంత్రి తుమ్మల అరుదైన రికార్డు

(మొదటి పేజీ తరువాయి)
రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాల మార్పుల మధ్య కూడా ఈ గౌరవం వరుసగా దక్కడం ఆయన సుదీర్ఘ ప్రజాజీవితానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**20 సార్లు జెండా ఆవిష్కరణ.. ఇప్పుడు 21వ సారి**
1985 నుంచి 1989 వరకు ఐదుసార్లు, 1995 నుంచి 2003 వరకు తొమ్మిదిసార్లు, 2015 నుంచి 2018 వరకు నాలుగుసార్లు, 2024, 2025 సంవత్సరాల్లో ఒక్కోసారి చొప్పున ఇప్పటివరకు 20 సార్లు తుమ్మల నాగేశ్వరరావు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో 2026 ఆగస్టు 15న 21వసారి ఈ గౌరవం దక్కడం రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది.

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 15న త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయనకు, తన సొంత ప్రాంతానికి ఆనుకుని ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ బాధ్యత దక్కడం విశేషంగా చెప్పుకోవచ్చు.

**పతాకావిష్కరణ చేసిన సంవత్సరాలు**
1985, 1986, 1987, 1988, 1989, 1995, 1996, 1997, 1998, 1999, 2000, 2001, 2002, 2003, 2015, 2016, 2017, 2018, 2024, 2025

# కూలిపోయిన టన్నెల్

● సొరంగంలోనే చిక్కుకున్న కార్మికులు

**టి మీడియా, ఆగస్టు 13, చమోలీ :**
ఉత్తరాఖండ్ చమోలీ జిల్లా పీపల్‌కోటి (మయాపూర్) వద్ద గురువారం ఘోర ప్రమాదం జరిగింది. టీహెచ్‌డీసీ (టిహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ప్రాజెక్టులో భాగంగా హెచ్‌సీసీ సంస్థ నిర్మిస్తున్న జల విద్యుత్ ప్రాజెక్ట్ టన్నెల్‌లోకి ఒక్కసారిగా భారీ ఎత్తున వరద నీరు, మట్టి శిథిలాలు వచ్చి చేరాయి. ఈ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అకస్మాత్తుగా వరద నీరు చేరడంతో, పనుల్లో ఉన్న కార్మికులు, యంత్రాలు, వాహనాలు లోపలే చిక్కుకుపోయాయి. హెచ్‌సీసీ సంస్థ ఆధ్వర్యంలో టన్నెల్ నిర్మాణం జరుగుతుండగా గురువారం సాయంత్రం సుమారు 6:30- 6:45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది.ప్రమాద వార్త తెలిసిన వెంటనే చమోలీ జిల్లా యంత్రాంగం అప్రమత్తం అయింది.

# ఎక్సైజ్ కనుసన్నల్లోనే మద్యం దందా..?




● ఆధారాలతో ఫిర్యాదులు చేసినా స్పందనకరువు

● ఆటోల్లో మద్యం తరలిస్తున్నారంటూ ఆరోపణలు

**టీ మీడియా,ఆగస్ట్13,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో మద్యం వ్యాపారం చుట్టూ మరోసారి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మండలంలోని మారుమూల గ్రామాలు,తండాలకు ప్రతిరోజూ సుమారు 7 నుంచి 10 ఆటోల ద్వారా మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.ఇంత పెద్దఎత్తున మద్యం రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.మద్యం దుకాణాలు సిండికేట్‌గా మారకముందు అనుమతులకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న ఆటోలపై దాడులు చేసి, వాహనాలను సీజ్ చేసిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు గుర్తుచేస్తున్నారు.మరి ఇప్పుడు అదే తరహాలో ఆటోల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు మద్యం వెళ్తోందనే ఆరోపణలు వస్తున్నా తనిఖీలు ఎందుకు జరగడం లేదు..?గతంలో కనిపించిన అధికారుల దూకుడు ఇప్పుడు ఏమైందని ప్రశ్నిస్తున్నారు.ముఖ్యంగా మద్యం అక్రమ రవాణా,విక్రయాలకు సంబంధించిన ఆధారాలతో సహా పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు మరింత చర్చకు దారితీస్తున్నాయి.ఆధారాలు అందించిన తర్వాత కూడా క్షేత్రస్థాయిలో తనిఖీలు,చర్యలు కనిపించకపోవడానికి కారణం ఏమిటో అర్థంకాని పరిస్థితిలో సింగరేణి మండల ప్రజలు ఉన్నారని పలువురు చెబుతున్నారు.ఫిర్యాదుల్లో వాస్తవం లేకపోతే అదే విషయాన్ని స్పష్టం చేయాలని,వాస్తవం ఉంటే బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.సిండికేట్ ఏర్పడిన తర్వాతే ఎక్సైజ్ శాఖ మౌనం వహిస్తోందా..? లేక అధికారులకు తెలియకుండానే ఇంత పెద్దఎత్తున మద్యం రవాణా సాగుతోందా..? ఆధారాలతో ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడం వెనుక కారణమేంటి..? అనే ప్రశ్నలు ఇప్పుడు మండలంలో బలంగా వినిపిస్తున్నాయి.గ్రామాలు,తండాలకు ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ సమగ్ర తనిఖీలు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.మద్యం ఎక్కడి నుంచి వస్తోంది..?ఎవరి ఆధ్వర్యంలో ఆటోలు తిరుగుతున్నాయి..?నిబంధనలకు అనుగుణంగానే రవాణా జరుగుతోందా..? లేక సిండికేట్ ఆధ్వర్యంలో అనధికారిక సరఫరా వ్యవస్థ నడుస్తోందా..?అనే అంశాలపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.గతంలో చిన్న సమాచారం వచ్చినా వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేసిన ఎక్సైజ్ శాఖ,ప్రస్తుతం ఆధారాలతో కూడిన ఫిర్యాదులు వస్తున్నాయని చెబుతున్నప్పటికీ మౌనంగా ఉందనే ఆరోపణలు ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతున్నాయి.సిండికేట్‌పై చర్యలు తీసుకోవాల్సిన శాఖే పరోక్షంగా అండగా నిలుస్తోందా..? అధికారుల మౌనం వెనుక మరేదైనా కారణం ఉందా..? అనే చర్చ సాగుతోంది.ఇప్పటికైనా జిల్లా స్థాయి ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగి సింగరేణి మండలంలోని మద్యం రవాణా,విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.ఇప్పటికే అందినట్లు చెబుతున్న ఫిర్యాదులు,ఆధారాలను పరిశీలించి నిజానిజాలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు,ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదన్న అంశంపైనా ఉన్నతస్థాయి అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.




# 5వేల మంది పైలట్లకు డ్రగ్ టెస్టులు

(మొదటి పేజీ తరువాయి)
పరీక్షలు నిర్వహించనున్నారు. ఆ పరీక్షలు తప్పనిసరని సంస్థలు పైలట్లకు పంపిన సమాచారంలో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం, అనుమతి లేని పదార్థాలు లేదా మందులను ఎవరైనా వినియోగిస్తున్నారా అనే అంశాన్ని గుర్తించేందుకు పూర్తిస్థాయి స్క్రీనింగ్ నిర్వహించనున్నారు. ఆ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభవుతాయని సమాచారం.

గురుగ్రామ్‌లోని శిక్షణ అకాడమీలో శిక్షణ కార్యక్రమాలతో పాటు పరీక్షలను నిర్వహించనున్నారు. అలాగే విమాన ప్రయాణం పూర్తయిన తర్వాత ఫ్లైట్ బ్రీఫింగ్ కేంద్రాల్లో కూడా పరీక్షలు చేస్తారు. ఎయిర్‌లైన్స్ కార్యాలయాలు, ఆయా బేస్‌లకు కేటాయించిన కేంద్రాల్లో స్క్రీనింగ్ చేపట్టనున్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చాటిచెప్పేందుకే ఆ చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. విమాన సిబ్బంది విషయంలో భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేయడంతో పాటు ప్రయాణికులు, ఇతర భాగస్వాముల్లో నమ్మకాన్ని పెంచడమే లక్ష్యంగా పరీక్షలను చేపడుతున్నట్లు తెలిపాయి.

**12 గంటల నిబంధన ఏం చెబుతోంది?**
డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిబంధనల ప్రకారం, విమాన సిబ్బంది డ్యూటీకి ముందు 12 గంటల్లో మద్యం, మత్తు కలిగించే మందులు, నార్కోటిక్ లేదా స్టిమ్యులెంట్ డ్రగ్స్ వంటివి తీసుకోకూడదు. విమానంలో ఉన్న సమయంలో కూడా ఇలాంటి పదార్థాలను వినియోగించకూడదు. అయితే కేవలం 12 గంటలు గడిచినంత మాత్రాన పైలట్ విమానం నడపడానికి అర్హుడని భావించలేం. డ్యూటీకి హాజరయ్యే సమయంలో మద్యం మత్తులో ఉండకూడదు. రక్తంలో ఆల్కహాల్ గుర్తించినా విమానం నడపడానికి అనుమతి ఉండదు. అలాగే పైలట్ పనితీరును ప్రభావితం చేసే సైకోఆక్టివ్ పదార్థాల ప్రభావంలో ఉండే లైసెన్స్ ద్వారా లభించే అధికారాలను వినియోగించకూడదు. విమానాన్ని సురక్షితంగా నడిపే సామర్థ్యంపై ప్రభావం ఉన్నట్లు తేలితే విధులకు దూరంగా ఉండాల్సి ఉంటుంది.

**300 అడుగులు కిందకు పడ్డ విమానం**
ఆగస్టు 4వ తేదీన పుకెట్ నుంచి దిల్లీకి బయలుదేరిన ఎయిరిండియా విమానం ా×2379లో ఆ ఘటన చోటు చేసుకుంది. ఎయిర్?బస్ ా320 విమానం ప్రయాణ సమయంలో అకస్మాత్తుగా సుమారు 300 అడుగులు కిందకు పడింది. అనంతరం కాసేపటికి అదుపులోకి వచ్చింది. దిల్లీలో సేఫ్?గా ల్యాండ్ అయింది. ఆ ఘటనలో పలువురు ప్రయాణికులతోపాటు విమాన సిబ్బంది గాయపడ్డారు. దీంతో ఆ ఘటనపై ఎయిర్?క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు చేస్తోంది. ఆ విమానానికి కమాండ్ చేసిన పైలట్?కు తొలుత నిర్వహించిన స్క్రీనింగ్ అనంతరం నిర్ధరణ పరీక్ష నిర్వహించగా, గంజాయి పాజిటివ్?గా తేలింది. దీంతో విమాన భద్రతపై మరోసారి చర్చ మొదలైంది.

మరోవైపు, విమానానికి సంబంధించినట్లు చెబుతున్న పోస్ట్?- ఫ్లైట్ మెయింటెనెన్స్ నివేదికలో పలు సాంకేతిక హెచ్చరికలు నమోదైనట్లు సమాచారం. ఎయిర్?బస్ ా320 విమానంలో హైడ్రాలిక్ వ్యవస్థలకు సంబంధించిన పలు లో- ప్రెజర్ అలర్ట్?లు నమోదైనట్లు నివేదిక పేర్కొంది. గ్రీన్, బ్లూ, ఎల్లో హైడ్రాలిక్ వ్యవస్థల్లో తక్కువ ఒత్తిడికి సంబంధించిన హెచ్చరికలు వచ్చినట్లు సమాచారం. ఎల్లో, బ్లూ హైడ్రాలిక్ రిజర్వాయర్స్?లో లిక్విడ్ రేంజెస్? తక్కువగా ఉన్నాయని నివేదికలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే విమానం ఒక్కసారిగా కిందకు పడడానికి పైలట్ పరీక్షలో బయటపడిన అంశాలకే కారణమని ఇప్పటి వరకు అధికారికంగా నిర్ధరణ కాలేదు. విమాన ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను ఏఏఐబీ పరిశీలిస్తోంది.

# పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ములో ఏజెన్సీల అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)
నియమించుకుంటాయి. వారు ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్నా ఆ ఏజెన్సీలే కొంత కమీషన్ తీసుకుని వారికి జీతాలు ఇస్తాయి. ఉద్యోగి వేతనంలో 24 శాతం సొమ్మును పీఎఫ్(ప్రావిడెంట్ ఫండ్) కింద, మరో 4 శాతం సొమ్మును ఈఎస్ఐ కింద ఆయా సంస్థలకు ఏజెన్సీ నెలనెలా తప్పకుండా జమ చేయాలి. నెలకు ఆర్థికశాఖ విడుదల చేసే రూ.352 కోట్లలో ఇలా రూ.98.56 కోట్లను కట్టాల్సి ఉంది. ఏడాదికి సుమారు రూ.1,182 కోట్లు చెల్లించాలి.

**వివరాలు లేవు**
కానీ చాలా ఏజెన్సీలు కొన్నేళ్లుగా పీఎఫ్, ఈఎస్?ఐ చెల్లించడం లేదని తాజా విచారణలో అధికారులు గుర్తించారు. ఇప్పటికే రూ.వెయ్యి కోట్లకు పైగా చెల్లింపుల లెక్కల ఆనవాళ్లు కూడా దొరకలేదని అధికారవర్గాలు చెప్పాయి. నెలనెలా నిధులిచ్చే శాఖలు కూడా తమ వద్ద ఈ వివరాలు లేవని చెబుతుండటం గమనార్హం. గత పదేళ్ల లెక్కలు పలు శాఖల్లో లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఏజెన్సీలు కడుతున్నాయా? లేదా అనే వివరాలు సేకరించి పంపాలని రాష్ట్ర






ప్రభుత్వం పీఎఫ్ కమిషనర్‌ను తాజాగా కోరినట్లు తెలిసింది. ప్రతి ఉద్యోగి ఆధార్, పాన్, ఫోన్ నంబరు సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ(ఐఎఫ్ఎంఎస్) పోర్టల్‌లో గత ఆరు నెలల నుంచి ఆర్థికశాఖ అడుగుతుండటంతో ఈ ఏజెన్సీల అక్రమాలు మెల్లగా బయటకొచ్చాయి.ఈ ఏజెన్సీల పనితీరుపై ప్రభుత్వం ఇటీవల ఉన్నతస్థాయి కమిటీని నియామకం చేసింది. ప్రతి ఉద్యోగికి చెల్లించే జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల వివరాలన్నీ ఈ కమిటీ అడిగితే మొత్తం 4,500 ఏజెన్సీల్లో చాలా వరకు అసలు ఏ వివరాలు సమర్పించలేదు. ఈ నేపథ్యంలో కొన్ని ఏజెన్సీల వారు పట్టుబడకుండా ఇతరుల పేరు మీదకు ఏజెన్సీలను వేగంగా మార్చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలకు ఇంతకాలం సహకరించిన అధికారులు కూడా పట్టుబడితే తమ ఉద్యోగాలకు ఎసరు వస్తుందని ఏజెన్సీలు వారిని కాపాడేందుకు వివిధ మార్గాలు చెబుతున్నారు. కొందరు నేతలు కూడా వారిని కాపాడేందుకు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు.

**నియామకాల్లో సైతం లొసుగులు**
పొరుగుసేవల ఉద్యోగుల నియామకాల్లో సైతం చాలా చోట్ల లొసుగులున్నట్లు సమాచారం. కొందరికి కనీస అర్హతలు కూడా లేవని తెలుస్తోంది. ఉద్యోగానికి సంబంధం లేని ఇతర రాష్ట్రాలకు చెందిన వర్సిటీల డిగ్రీలతో కొందరు డ్యూటీలు చేస్తున్నారు. కొందరు అధికారులు తమ ఇళ్లలో పనిచేయించుకుంటూ ప్రభుత్వంలో పనిచేస్తున్నట్లు రికార్డుల్లో చూపెడుతుండటం గమనార్హం. కొన్నిచోట్ల ఉద్యోగి పేరు ఒకటి ఉంటే, అక్కడ వారి తరఫున వేరే వారు ఉద్యోగాం చేస్తున్నారు. ఇలాంటివి ఇంకా ఎక్కడైనా ఉన్నాయా? అనేది కూడా పట్టుకునేందుకు అంతర్గత విచారణ చేయిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలి



### ⏭|రాజమండ్రి వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు

**టీ.మీడియా,ఆగస్టు13,చింతూరు:**
చింతూరు మండలంలో జూలై నెల నుంచి వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిలిపివేయడంతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన వాహనదారులు ఫిట్‌నెస్ కోసం రాజమండ్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫిట్‌నెస్ పరీక్షల కోసం రాజమండ్రికి వెళ్లాలంటే సుమారు 140 కిలోమీటర్లు ప్రయాణించడంతో పాటు, తిరిగి మరో 140 కిలోమీటర్లు రావాల్సి వస్తోందని ఆటో యూనియన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘాట్‌రోడ్డు మార్గంలో ప్రయాణించాల్సి ఉండటంతో సమయం, ఇంధన ఖర్చులతో పాటు వాహనదారులకు అదనపు భారం పడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో చింతూరు మండలంలోని ఆటో యూనియన్ సభ్యులు కలిసి ఆర్టీఓ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చల్లారావును కలిసి తమ సమస్యలను వివరించారు. చింతూరు సబ్ డివిజన్ పరిధిలోనే వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. చట్టి, చింతూరు, చిడుమూరు తదితర ప్రాంతాలకు చెందిన ఆటో యూనియన్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని, స్థానికంగానే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించడం ద్వారా నాలుగు మండలాల వాహనదారులకు ప్రయోజనం కలుగుతుందని కోరారు.

# విద్యార్థులకు ఉచిత బూట్లు



### ⏭| పంపిణీ చేసిన సర్పంచ్

**టీ మీడియా,ఆగస్టు13, ములకలపల్లి:**
ములకలపల్లి మండలంలో మూకమామిడి గ్రామపంచాయతీలో గుట్టగూడెం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గురువారం ప్రభుత్వం అందించిన ఉచిత బూట్లు పంపిణీ చేసిన మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి.ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ. పిల్లలందరూ శుభ్రంగా,క్రమశిక్షణతో పాఠశాలకు రావాలి అని చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యం.ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ఉచితంగా ఇచ్చిన బూట్లు సద్వినియోగం చేసుకోవాలి అని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు జి బద్రు మాట్లాడుతూ. ప్రభుత్వం ప్రతి సంవత్సరంయూనిఫామ్, బూట్లు,పుస్తకాలు అందిస్తోంది.దీనివల్ల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి బద్రు ఉపాధ్యాయులు బి లక్ష్మణ్,ఎ శ్రీను,కె రాంబాబు,జి కృష్ణ,వాడే రామచంద్రం మరియు పిల్లల తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.బూట్లు అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

# అన్నం పెట్టిన బ్యాంకుకే కన్నం..



### ⏭| రూ. 90 లక్షల బంగారం మాయం

**టి మీడియా, ఆగస్టు 13,మహబూబాబాద్ :**
జిల్లా కేంద్రంలోని ఇండియన్ బ్యాంకులో బంగారం మాయం ఘటన కలకలం రేపింది.. అదే బ్యాంకులో పనిచేసే అసిస్టెంట్ మేనేజర్ బంగారం మాయం చేసినట్లు ఆడిట్‌లో తేల్చారు. బ్యాంక్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు బాగోతం బయటపడింది.

దొంగిలించిన బంగారం ఏం చేశాడో తెలుసా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండియన్ బ్యాంకులో ఖాతాదారులు తాకట్టు పెట్టిన అపహరణకు గురవడం సంచలనం రేపింది.. ఆడిట్‌లో బంగారం మాయం అయినట్లు గుర్తించిన బ్యాంక్ అధికారులు పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో అసలు బాగోతం బయటపడింది.ఈ బ్యాంక్ లో బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టి రుణాలు తీసుకున్న 22 మంది ఖాతాదారులకు చెందిన 700 గ్రాముల బంగారు ఆభరణాలు మాయం అయ్యాయి. ఇదే బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న రాజేష్ అనే ఉద్యోగి గుట్టు చప్పుడు కాకుండా మాయం చేశాడు.చోరీ చేసిన బంగారు ఆభరణాలను మరో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టుపెట్టి రుణాలు తీసుకున్నాడు. ఆ డబ్బును తన సొంత అవసరాలకు వాడుకున్నాడని విచారణలో తేలింది. అపహరణకు గురైన బంగారం విలువ సుమారు 90 లక్షల రూపాయలు ఉంటుందని బ్యాంక్ అధికారులు, పోలీసులు గుర్తించారుప్రతి నెల బ్యాంక్ మేనేజర్ పర్యవేక్షణలో బాగంగా నిర్వహించే తనిఖీల్లో ఈ చోరీ విషయం బయటపడింది. చోరీ విషయం తెలుసుకున్న బ్యాంకు మేనేజర్ మహబూబాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ రఘుపతిరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అసిస్టెంట్ మేనేజర్ రాజేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడుఇంట్లో దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు అన్నట్లు గుట్టుచప్పుడు కాకుండా బంగారం మాయం చేసిన ఆ ఇంటిదొంగను వెంటనే పట్టుకుని ఖాతాదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. బ్యాంక్ అధికారులు మాత్రం ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బంగారం భద్రంగా ఉందని బరోసా కల్పిస్తున్నారు.. బంగారం మాయం చేయడం ఇదే ప్రమాదమా..! గతంలో కూడా ఇదే తరహాలో మోసానికి పాల్పడ్డాడా పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

# ఆసుపత్రుల్లో నిర్లక్ష్యానికి తావులేదు



### ⏭|ప్రజల ఆరోగ్యమే తొలి ప్రాధాన్యత

### ⏭| ఎమ్మెల్యే జారే

**టీ మీడియా,ఆగస్టు 13, దమ్మపేట :**
ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రుల్లో ప్రజలకు, విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. గురువారం దమ్మపేట మండల పరిధిలోని కొమ్మ్ముగూడెం గ్రామంలో "నేను సైతం చేయూత -- విద్యా యాత్ర మన ఎమ్మెల్యే -- మన బడి కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే పలు ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.కొమ్మ్ముగూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, పాఠశాలలో అందుతున్న బోధనా విధానంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయా, తరగతి గదుల నిర్వహణ ఎలా ఉంది అనే అంశాలను పరిశీలించారు.అదేవిధంగా పాఠశాలలో తాగునీటి సదుపాయం, వంటశాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతులు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అక్కడి నిర్వహణను పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న సేవలు, కేంద్రం పరిశుభ్రత, మౌలిక సదుపాయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు.కొమ్మ్ముగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే స్థానిక పాలన, గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, గ్రామాభివృద్ధి పనుల పురోగతి తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవల పరిస్థితిని తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది అందుబాటు తదితర అంశాలపై ఆరా తీశారు.ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని స్పష్టం చేశారు.విద్యార్థుల భవిష్యత్తు, ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశాలు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రుల్లో నాణ్యమైన సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుంది. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తాం అని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి

### ⏭| జిల్లా కలెక్టర్ అంకిత్

**టీ మీడియా,ఆగస్ట్13,సుజాతనగర్ :**
మండలం సింగభూపాలెం, వేపలగడ్డ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి, సంక్షేమ, విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగభూపాలెం చెరువును సందర్శించిన కలెక్టర్ నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించారు. చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం 19 అడుగులు కాగా, ప్రస్తుతం 14.5 అడుగుల నీరు ఉన్నట్లు అధికారులు వివరించారు. ఈ చెరువు ద్వారా సుమారు 2,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని, పెసర, కూరగాయల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం పాత అంజనాపురం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయ పంటలు, పెసర, పత్తి పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కాకరకాయ, సొరకాయ తదితర కూరగాయల సాగును పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. సింగభూపాలెం గ్రామంలో మొదటి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులతో పాటు రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న సర్వేను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.లో మిషన్ భగీరథ పథకం కింద రూ.49 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సంప్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు 60 శాతం మేర తాగునీటి సరఫరా జరుగుతోందని, ప్రతి ఇంటికి 100 శాతం సురక్షితమైన తాగునీరు అందించేందుకు సంప్ నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. గ్రామంలో రోజుకు సుమారు 2 లక్షల లీటర్ల తాగునీరు అవసరమవుతుందని తెలిపారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సంప్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు కూడా ముందస్తు ప్రణాళికతో తాగునీటి కనెక్షన్లు కల్పించాలని ఆదేశించారు.అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరో తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సదుపాయాలు, బోధన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్ పఠన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల పఠన సామర్థ్యంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని ఆదేశించారు. తాను మరో నెల రోజుల్లో తిరిగి పాఠశాలను సందర్శిస్తానని, అప్పటికి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, గణితంలో స్పష్టమైన పురోగతి సాధించేలా చర్యలుబ తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.అనంతరం వేపలగడ్డ గ్రామంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్ బాబు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏవోలు, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సర్వే బృందాల సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పేదల రుణం తీర్చుకునే అవకాశం

(మొదటి పేజీ తరువాయి)ద
ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారని గుర్తుచేశారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న సీఎం, రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించామని చెప్పారు. మహిళా సంఘాలకు 1000 ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. శిల్పారామం వద్ద రూ.వెయ్యి కోట్లతో ఇందిరా మహిళాశక్తి స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం అప్పులు చేసి పోయిందని, ఓ వైపు వాటన్నింటినీ తీర్చుకుంటూనే మరోవైపు సంక్షేమం వైపు దృష్టి పెడుతున్నామని సీఎం తెలిపారు.

**ఆ విషయంలో ఆందోళన అక్కర్లేదు**

ఈ సందర్భంగా 22–ఎ భూముల అంశంపై రేవంత్ రెడ్డి మాట్లాడారు. 'మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22–ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తానన్నారు. ఈ విషయంలో తనదీ పూచీ అని చెప్పారు. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారన్న సీఎం, సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని'అని సీఎం తెలిపారు.

# పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే పోరు ఉధృతం

**▶▶| పీఆర్సీ అమలు చేయాలి..**

**▶▶| ఆరు డీఏలు విడుదల చేయాలి తహసీల్దార్‌కు యూఎస్పీసీ వినతిపత్రం**



**టీ మీడియా,ఆగస్ట్13, సింగరేణి (కారేపల్లి):** ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) డిమాండ్ చేసింది.సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేస్తే దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించింది.యూఎస్పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపులో భాగంగా గురువారం సింగరేణి మండల యూఎస్పీసీ నాయకులు కారేపల్లి తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లును కలిసి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా యూఎస్పీసీ నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు గడుస్తున్నా నూతన పీఆర్సీని అమలు చేయకపోవడం ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని,వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కేజీబీవీ,మోడల్ స్కూల్,గురుకుల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుని పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.తమ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు,ఆగస్టు 29న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ మొదటి వారంలో 'చలో అసెంబ్లీ'కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ సింగరేణి మండల నాయకులు కేవీ కృష్ణారావు,బానోత్ మంగీలాల్,గురుమూర్తి, మల్లేశ్వరరావు, బన్సీలాల్,ఈరు నాయక్,భూక్య రాంకోటి, యూటీఎఫ్ మండల ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి,నాగేశ్వరరావు, కోశాధికారి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శులు రామకృష్ణ, సంతులాల్, రామారావు,శివకోటి,బాలకృష్ణ,లకుపతి,భాస్కరరావు,శ్రీలత,సునీత,అప్పారావు,వీ. శ్రీనివాసరావు, రాజారావు,చిన్నారాములు,సోమ్లా,శ్యామ్ ప్రసాద్,మురళీ,కిషన్,చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# విప్లవ స్ఫూర్తికి ప్రతీక ఫిడెల్ క్యాస్ట్రో



**▶▶| కారేపల్లిలో ఘనంగా శత జయంతి వేడుకలు**

**▶▶| చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఐ(ఎం) నేతల నివాళి**

**టీ మీడియా,ఆగస్ట్13,సింగరేణి(కారేపల్లి):** ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో తనదైన ముద్ర వేసిన క్యూబా విప్లవ నాయకుడు,మాజీ అధ్యక్షుడు ఫిడెల్ క్యాస్ట్రో శత జయంతి వేడుకలను గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కారేపల్లిలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా క్యాస్ట్రో చిత్రపటానికి పార్టీ నాయకులు,కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ముక్కా సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కె.నరేంద్ర మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి క్యూబాలో విప్లవానికి నాయకత్వం వహించిన ఫిడెల్ క్యాస్ట్రో ప్రపంచవ్యాప్తంగా పోరాట ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. అనేక సవాళ్లు,ఒత్తిళ్లను ఎదుర్కొంటూనే క్యూబాలో సోషలిస్టు వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆయన కృషి చేశారని పేర్కొన్నారు.విద్య,వైద్యం వంటి రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో క్యాస్ట్రో నాయకత్వంలోని క్యూబా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు.ప్రజల హక్కులు,సామాజిక సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.క్యాస్ట్రో ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మేకల తిరపయ్య,మంద శ్రీను,తొగర బాబు,రాబోతు రమేష్,తురక కోటయ్య,పేర్ని సాంబయ్య,తురక సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమా కుటుంబానికి అండగా ఉంటాం

**▶▶| నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్.చంద్రావతి**



**టీ మీడియా,ఆగస్టు14,సింగరేణి(కారేపల్లి):** విద్యుద్ఘాతంతో మృతి చెందిన మహిళా రైతు వడ్డే ఉమా కుటుంబాన్ని వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి గురువారం పరామర్శించారు. కారేపల్లి మండలం విశ్వనాథపల్లి గ్రామంలో నిర్వహించిన ఉమా సంస్మరణ కార్యక్రమానికి హాజరైన ఆమె, ఉమా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మృతురాలి భర్త వడ్డే రమేష్‌తో పాటు తల్లిని కోల్పోయి విషాదంలో ఉన్న ఇద్దరు కుమార్తెలను చంద్రావతి ఓదార్చి ధైర్యం చెప్పారు.కుటుంబ సభ్యులతో కొంతసేపు మాట్లాడి ఉమా మృతి చెందిన ఘటన వివరాలను తెలుసుకున్నారు.కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.తల్లి లేని లోటు తీర్చలేనిదని,అయినప్పటికీ ఆమె తమపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చేలా కుమార్తెలు ధైర్యంగా ముందుకు సాగాలని చంద్రావతి సూచించారు.మంచి చదువుతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుని తల్లి ఆశయాలను సాకారం చేయడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు.కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ,బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు ముత్యాల వెంకట అప్పారావు,నాయకులు తాత వెంకటేశ్వర్లు,తాత ఉపేందర్,సురపురెడ్డి రవీందర్ రెడ్డి,చాగంటి కోటయ్య,తమ్మిని ముత్తయ్య,దొంతు దాసు,వడ్డే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కారుకు ప్రమాదం



**టి మీడియా, ఆగస్టు 13, మరిపెడ :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం శివారులోని రైస్‌మిల్లుకు వెళ్లే రహదారిలో మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ ప్రయాణిస్తున్న కారు గురువారం ప్రమాదానికి గురైంది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పినట్లైంది.స్థానికుల కథనం ప్రకారం.. ముందుగా వెళ్తున్న ఓ ద్విచక్రవాహనం అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో, ఎదురుగా వస్తున్న కూలీలను తప్పించేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు డ్రైవర్ వాహనాన్ని నెమ్మదిగా నడిపారు. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు.. మాజీ ఎమ్మెల్యే కారు వెనుక భాగాన్ని ఢీకొట్టింది.దీంతో మాజీ ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు వెనుక భాగం దెబ్బతింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న అబ్బాయిపాలెం, ధారావత్ తండా గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని రెడ్యా నాయక్‌ను పరామర్శించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కొత్తగూడెం కార్పొరేషన్ డీపీఆర్ రద్దు

**▶▶| ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**టి మీడియా, ఆగస్టు 13, భద్రాద్రి కొత్తగూడెం:** కొత్తగూడెం కార్పొరేషన్ డీపీఆర్ రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. గురువారం ఆయన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ కక్ష సాధింపుగా తమ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా కార్పొరేషన్ చేస్తే ఓర్వలేక పోతున్నారన్నారు. తమ పార్టీ అభ్యర్థి తొలిసారి మేయర్ అయ్యారని, ఇప్పుడే పాలన గాడిలో పడుతుందని పసి బాలుడిపై ప్రతాపం చూపిస్తారా అని ఆయన విమర్శించారు. నిరాధార ఆరోపణలు చేయకూడదని, అలా చేసేవారిని విడిచిపెట్టమని హెచ్చరించారు. తమ పార్టీ ఎదుగుదలను చూసి కొంతమంది తట్టుకోలేక రాక్షసంగా వ్యవహరిస్తున్నారని దుర్మార్గమైన విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. డీపీఆర్ పేరుతో కుంభకోణాలు జరిగాయని విమర్శలు చేస్తున్నారని, తమ పార్టీ ఎక్కడా అవినీతికి తావివ్వదన్నారు. తమ పార్టీ చందాలు వసూలు చేయదని, కేవలం పార్టీ కార్యక్రమాలకు మాత్రమే చందాలు వసూలు చేసి పక్కా రసీదులు ఇస్తామని తెలిపారు.కొత్తగూడెం కార్పొరేషన్ అభివృద్ధికి రూ.600 కోట్లు నిధులు ప్రతిపాదనలు చేశామని అందులో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో 1.6 1.7 పర్సంటేజీలు డిపిఆర్ కు ఇవ్వటం జరుగుతుందని. అవి ఎవరి జేబులోకి వెళ్లేవి కావన్నారు. అందుకే విమర్శలను కూడా ఛాలెంజ్‌గా తీసుకుని డీపీఆర్‌ను ఆన్‌లైన్ టెండర్ వేయడం జరుగుతుంది.. కానీ అభివృద్ధిని మాత్రం ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తమ పార్టీ తరఫున కార్పొరేటర్ గాని, ఇతర నాయకులు గాని అవినీతికి పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. ఇంటి నంబర్ల పేరుతో ఎవరు ఒక్క రూపాయి కూడా తీసుకునే వీలు లేదన్నారు. ఎవరు తీసుకున్నట్లు తన దృష్టికి వస్తే వారిపై చర్యలు తీసుకోవడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ సుజాత, మేయర్ గణేష్, సిపిఐ జిల్లా సెక్రెటరీ షాబీర్ పాషా, సిపిఐ కార్పొరేటర్లు పాల్గొన్నారు

# సేవా కార్యక్రమాలతో రేణుక చౌదరి జన్మదిన వేడుకలు



**● కారేపల్లిలో కేక్ కట్**

**● ఆసుపత్రి రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ**

**టీ మీడియా,ఆగస్ట్13,సింగరేణి(కారేపల్లి):** మాజీ కేంద్రమంత్రి,రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుక చౌదరి జన్మదిన వేడుకలను గురువారం కారేపల్లిలో ఘనంగా నిర్వహించారు.పోలంపల్లి మాజీ సర్పంచ్ దారావత్ భద్రునాయక్,ఉసిరికాయలపల్లి మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు రేణుక చౌదరి జన్మదినాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు రేణుక చౌదరి జన్మదిన కేక్‌ను కట్ చేసి పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు.అనంతరం కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా దారావత్ భద్రునాయక్,గడ్డం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా అభివృద్ధిలో రేణుక చౌదరి తనదైన ముద్ర వేశారని కొనియాడారు. కేంద్రమంత్రిగా,పార్లమెంట్ సభ్యురాలిగా ఉమ్మడి ఖమ్మం జిల్లా సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ఖమ్మం జిల్లా ప్రజలతో ఆమెకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు.రేణుక చౌదరి మరెన్నో జన్మదినాలు జరుపుకుంటూ ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లావణ్య,లక్ష్మణ్‌తో పాటు గుగులోత్ వీరన్న,సక్రు నాయక్,రమేష్,గుగులోత్ రాము, వినాయక్, యశ్వంత్, రాందాస్,బబ్లు తదితరులు పాల్గొన్నారు.

# రవాణా శాఖ తనిఖీ వ్యవస్థలో సంస్కరణలు

**▶▶| అందుబాటులోకి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు**




**టి మీడియా, ఆగస్టు 13, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ రవాణా శాఖ మోటారు వాహనాల తనిఖీ వ్యవస్థలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు కొనసాగుతున్న సాంప్రదాయ మాన్యువల్ (హ్యాండ్‌మేడ్) తనిఖీల స్థానంలో పూర్తి స్థాయిలో 'ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల' ను అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఈ ఆధునిక విధానంలో మానవ ప్రమేయం లేకుండా, అధునాతన సెన్సార్లు మరియు సాంకేతిక పరికరాల ద్వారా వాహనాల ఫిట్‌నెస్‌ను లెక్కిస్తారు. వాహనాల బ్రేకింగ్ సామర్థ్యం, ఇంజిన్ పనితీరు, లైటింగ్, కాలుష్య ఉద్గారాలు ,ఇతర సాంకేతిక ప్రమాణాలను మెషీన్లు కచ్చితత్వంతో విశ్లేషిస్తాయి. దీనివల్ల ఆర్టీఏ ఆఫీసుల్లో అవినీతికి అడ్డుకట్ట పడటంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

**తొలి దశలో 15 కేంద్రాలు**

ఈ ప్రాజెక్ట్ అమలులో భాగంగా రవాణా శాఖ మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 15 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. ట్రక్కులు, బస్సులు, కార్లు, జీపులతో పాటు రవాణా రంగానికి చెందిన అన్ని రకాల వాహనాలను ఈ కేంద్రాల్లోనే పరీక్షించాల్సి ఉంటుంది. ఈ పరీక్షల ద్వారా వచ్చే తుది ఫలితాలు నేరుగా కేంద్ర ప్రభుత్వ 'వాహన్' పోర్టల్‌లో ఆటోమేటిక్‌గా నమోదు కావడం ఈ విధానం యొక్క ప్రధాన ప్రత్యేకత. ప్రయోగాత్మకంగా ప్రారంభమయ్యే ఈ సేవలను త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా 37 ఆశాజనక ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. డిజిటలైజేషన్ వైపు తెలంగాణ రవాణా శాఖ వేసిన ఈ అడుగు ప్రయాణికుల భద్రతను మరింత పెంచనుంది.

# విద్యార్థుల కోసం వంటగది నిర్మాణం

● యడ్లపల్లి సందీప్ జ్ఞాపకార్థం

రూ.70 వేల వితరణ

**టి మీడియా , ఆగస్టు 13, ఖమ్మం రూరల్ :**
విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎం. వెంకటాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. 70 వేల వ్యయంతో వంటగదిని నిర్మించి వితరణగా అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం అచ్చయ్య--ధనమ్మల మనవడు యడ్లపల్లి సందీప్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పాఠశాలకు వంటగదిని నిర్మించి అందించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీకి వంటగది లేక ఇబ్బందులు ఎదురవుతున్న తరుణంలో ఈ సదుపాయం కల్పించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.
గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రం అచ్చయ్య మాట్లాడుతూ.. సందీప్ జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉపయోగపడే సేవా కార్యక్రమం చేపట్టడం సంతృప్తినిచ్చిందన్నారు.ప్రతి నెల విద్యార్థులకు వివిధ రకాల అంశాలపై వ్యాసరచన ఉపన్యాసం క్విజ్ మొదలగు పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు 1500 వందల రూపాయలు అందించడం జరుగుతుందని



అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు దాతలు, గ్రామస్థులు ముందుకు రావాలని కోరారు. రానున్న రోజుల్లో తన వంతుగా ప్రభుత్వ పాఠశాలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు.

**సేవా కార్యక్రమాలు ఆదర్శనీయం**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాసరావు అన్నారు. వంటగది నిర్మాణానికి సహకరించిన గుర్రం అచ్చయ్య కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు కృపాభాయి విద్యార్థుల భోజన సౌకర్యం కోసం రూ.25 వేల విలువైన బల్లాలను అందించడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో పాఠశాలలో విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేగినాటి విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ కొళ్లపూడి సుమతి, మందపల్లి నాగమణి, యడ్లపల్లి వెంకటరామయ్య, నంద్ర ప్రసాద్, బందెల వెంకయ్య, ఏఏపీసీ చైర్మన్ రెంటాల భాగ్యమ్మ, మందటి వెంకటరమణ, కుర్ర వెంకన్న,శీలం శ్రీనివాస్,రెంటాల నాగేశ్వరరావు, వార్డు సభ్యులు గుమ్మడి వీరబాబు, రెంటాల శివ, తోకల వెంకన్న, బేతంపూడి నాగరాజు, గుర్రం రమేష్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపల్ మృతి

● మృతదేహంపై 27 కత్తిపోట్లు

**టి మీడియా , ఆగస్టు 13, కొండమల్లేపల్లి :**
నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో వివాహిత దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలిని కల్లు రూపారెడ్డి (48)గా గుర్తించారు. ఆమె స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భర్త రాజేందర్ రెడ్డితో కలిసి జేబీ కాలనీలో నివాసం ఉంటున్నారు.

**హైదరాబాద్ నుంచి ఒంటరిగా తిరుగు ప్రయాణం**

రూపారెడ్డి కుటుంబానికి హైదరాబాద్‌లోనూ సొంత ఇల్లు ఉంది. ఆమె కుమారుడు అభినవ్ రెడ్డి హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు తరచూ హైదరాబాద్‌కు వెళ్తుంటారు. గత శనివారం నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు ఉండటంతో రూపారెడ్డి భర్తతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. అయితే భర్తకు అక్కడ పని ఉండటంతో ఆమె మంగళవారం ఉదయం ఒక్కరే కొండమల్లేపల్లికి తిరిగి వచ్చారు. అనంతరం పాఠశాలకు వెళ్లి విధులకు హాజరయ్యారు.
సాయంత్రం ఇంటికి వెళ్లిన రూపారెడ్డి
రూపారెడ్డి సాధారణంగా సాయంత్రం 6.30 గంటల వరకు పాఠశాలలోనే ఉండేవారని తెలుస్తోంది. అయితే మంగళవారం తమ ఇంటికి స్నేహితులు వస్తున్నారని చెప్పి సాయంత్రం 5.25 గంటల సమయంలోనే పాఠశాలకు సమీపంలోని తన ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ఆమె నుంచి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం



అందలేదు. రాత్రి సమయంలో కూడా ఆమె ఫోన్‌కు పలుమార్లు ఫోన్? చేసినా స్పందించలేదు.

**ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో భర్త ఆందోళన**

బుధవారం ఉదయం భర్త రాజేందర్‌రెడ్డి రూపారెడ్డికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆందోళనకు గురైన ఆయన తమ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారికి ఫోన్ చేసి ఇంట్లోకి వెళ్లి చూడాలని కోరారు. వారు ఇంటికి వెళ్లి ఎంత పిలిచినా లోపల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో విషయాన్ని రాజేందర్ రెడ్డికి తెలియజేశారు.

**రక్తపు మడుగులో మృతదేహం**

దీంతో రాజేందర్ రెడ్డి తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న చింతపల్లి ఎస్సై రాంమూర్తికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. ఎస్సై స్థానికులతో కలిసి ఇంటికి వెళ్లి పరిశీలించగా రూపారెడ్డి రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని ఆమె భర్తకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

**శరీరంపై 27 కత్తిపోట్లు**

రూపారెడ్డి శరీరంపై సుమారు 27 కత్తిపోట్లు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. దీంతో ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. ఘటనకు ముందు ఆమె ఇంటికి ఎవరెవరు వచ్చారు? ఎవరితో ఆమెకు పరిచయాలు ఉన్నాయి? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

**డాగ్ స్క్వాడ్‌తో ఆధారాల సేకరణ**

పోలీసులు ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి ఆధారాలను సేకరించే ప్రయత్నం చేశారు. దేవరకొండ డీఎస్పీ శ్రీనివాస రావు, సీఐ నవీన్ కుమార్, ఎస్సై రమేశ్ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో లభించే సీసీటీవీ ఫుటేజీలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

**కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు**

రూపారెడ్డి కుమారుడు అభినవ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యకు కారణం ఏమిటి? నిందితులు ఎవరు? అనే అంశాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. త్వరలోనే కేసును ఛేదించి నిందితులను గుర్తించే దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు.

# మూడు రోజుల్లో సాగర్ ఆయుకట్టుకునీరు విడుదల

●మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి కలిసిన

మంత్రి తుమ్మల

**టీ మీడియా,ఆగస్ట్13,హైదరాబాదు :**
వర్షా బావ పరిస్థితుల మూలాన వేసిన పంటలు ఎండి పోకుండా చర్యలు తీసుకోవటానికి హైదరాబాదులో కీలక సమావేశం జరిగింది.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు ఈరోజు హైదరాబాదులో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారితో సమావేశం అయ్యారు.ఖమ్మం జిల్లాలో పంటల పరిస్థితిని వివరించారు.సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగర్ ఆయికట్టులో పంటలు ఎండిపోకుండా చూడాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు స్పందించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ నేపథ్యంలో రెండు మూడు రోజుల్లో సాగర్ ఆయ కట్టకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు



అంద నున్నది.వేసిన పంటలు ఎండిపోకుండా చూడాలని సత్తుపల్లి నియోజకవర్గ రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారికి విజ్ఞప్తి చేశారు.దీనికి స్పందించిన మంత్రి తుమ్మల వెనువెంటనే మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి గారిని కలవటం వెనువెంటనే జరగగా రెండు మూడు రోజుల్లో సాగర్ ఆయుకట్టుకు గోదావరి జలాలు రానున్నాయి..

# పొలంలో పసికందు మృతదేహం

**టీ మీడియా ,ఆగస్టు 13 ,కూసుమంచి:**
మానవత్వం మంట కలిసింది. కళ్ళ కావురం తల్లి కళ్ళు మూసుకుంది. పేగు తెంచి జన్మ ఇవ్వాల్సిన తల్లి, ఆది లోనే ఆ పసి గుడ్డును అంతమొందించింది. ఆ తల్లి బిడ్డను వద్దనుకొని పారేసింది. ఓ తల్లిగా... మహిళా లోకం తల దించుకుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి గ్రామం పంట పొలంలో గురువారం ఓ పసికందు మృతదేహం కనిపించింది. కూసుమంచి గ్రామానికి చెందిన నెల్లూరి వెంకటేశ్వర్లు అనే రైతు పొలం నీ. దున్నుతుండగా అటుగా నవజాతి శిశువు మృతదేహం కనిపించింది. వెంటనే ఆ రైతు సమాచారాన్ని అధికారులకు, స్థానిక ప్రజల కు అందజేశాడు. సమాచారం తెలిసిన ప్రజలంతా అధిక సంఖ్యలో సంఘటన స్థలం కి చేరుకొని, పసికందు మృతదేహాన్ని చూసి బాధతో చలించి పోయారు .కూసుమంచి ఎస్ ఐ నాగరాజు, మండల ప్రజా వైద్యాధికారి సాయికుమార్ సంఘటన స్థలం కి చేరుకొని పసికందు మృత దేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ శిశువు సుమారు 5 నుంచి 6. నెలల ప్రెగ్నెన్సీ అబార్షన్



చేసినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ విషయం తెలిసిన ప్రతి ఒక్కరూ అయ్యో...పాపం... అంటూ బాధను వ్యక్తం చేశారు.

# రూ.30 వేల అప్పు తీర్చలేదని



● 21 రోజుల పసికందు కిడ్నాప్?

**టి మీడియా, ఆగస్టు 13,హైదరాబాద్ :**
తీసుకున్న అప్పు తిరిగి చెల్లించడం లేదని ముక్కుపచ్చలారని పసిబిడ్డను కిడ్నాప్ చేసుందుకు యత్నించాడో వ్యక్తి. తనకు ఇవ్వాల్సిన బాకీ చెల్లిస్తేనే పసికందును తిరిగి ఇస్తానని చెప్పడంతో చేసేది లేక బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో సదరు వ్యక్తి పసికందును అప్పగించాడు. హైదరాబాద్? నగరంలోని రాజేంద్రనగర్?లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.బాధితులు, పోలీసుల కథనం ప్రకారం, రాజేంద్రనగర్?లోని మానికేశ్వర్? నగర్?లో అనిత, రాఘవేందర్ దంపతులు నివాసం ఉండేవారు. గతంలో వారు స్థానికంగా ఉండే మిట్టు, మంజుల దంపతుల వద్ద రూ.30,000 అప్పుగా తీసుకున్నారు. అయితే కొన్ని కారణాల వల్ల సమయానికి తిరిగి అప్పు చెల్లించలేకపోయారు. దీంతో డబ్బులు చెల్లించాలని మిట్టు తరచూ వారి ఇంటికి వచ్చి ఒత్తిడి చేసేవాడు. ఈ క్రమంలో వారు రాజేంద్రనగర్?లోని హనుమాన్?నగర్?లోని తమ బంధువుల ఇంటికి వెళ్లి అక్కడే ఉంటున్నారు.
ఆ దంపతులు ఇటీవలే ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఆ పసికందుకు ప్రస్తుతం 21 రోజుల వయసు ఉంటుంది. అయితే వారు ఉంటున్న ఇంటి వివరాలు తెలుసుకున్న మిట్టు, భార్య మంజులతో పాటు మరో మహిళను తీసుకుని అక్కడికి వెళ్లాడు. తాము ఇచ్చిన అప్పును చెల్లించాలిని డిమాండ్ చేశారు. అప్పు తీర్చేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరినప్పటికీ వారు ఏమాత్రం పట్టించుకోలేదు. బాకీ డబ్బులు చెల్లించనట్లయితే పసికందును ఎత్తుకుపోతామని వారు బెదిరించారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది.టిఫిన్? చేయిస్తామని చెప్పి పసికందుతో పరారీ : టిఫిన్ చేయిస్తామని చెప్పి మిట్టు, మంజుల పసిబిడ్డను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. అయితే దీనిపై అనుమానం కలిగి బాధితురాలు పోలీసులకు సమాచారం అందించారు. విషయం పోలీసుల వరకు వెళ్లడంతో వారు తిరిగి కొద్ది సేపటికి పసికందును తీసుకొచ్చి తిరిగి తల్లికి అప్పగించారు.తన బిడ్డను అపహరించిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరింది. మిట్టు వల్ల తన కుటుంబానికి ప్రమాదం ఉందని వాపోయింది. పోలీసులు అతనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. పసికందును ఎత్తుకుపోయిన వారి గురించి పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించింది. ఇదిలా ఉండగా మిట్టును అదుపులోకి తీసుకున్న పోలీసులు బాధితురాలి ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నట్టు చెబుతున్నారు.
అవసరాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది వడ్డీ వ్యాపారులు రుణ గ్రహీతల అవసరాన్ని ఆసరాగా చేసుకొని రూ.లక్షకు గరిష్ఠంగా 20 శాతం వడ్డీని వసూలు చేస్తున్నారు. ఇంకొంత మంది వాహనాలు, ఇల్లు, భూముల్ని తనఖా పెట్టుకుంటున్నారు. కొందరు వ్యాపారులు రోజులు, వారాల లెక్కన ఎక్కువ వడ్డీలకు రుణాలిస్తున్నారు. అప్పు ఇచ్చే సమయంలోనే నెల, వారం వడ్డీని మినహాయించుకుంటున్నారు. తర్వాత వాయిదా గడువు దాటితే మిత్తీలకు తోడు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు.

# అరుణావర్ణమైన ఖమ్మం పురవీధులు




● పలు డివిజన్లలో సిపిఐ పాదయాత్ర

**టీ మీడియా,ఆగస్ట్13,ఖమ్మం:**
ఖమ్మం పురవీధులు గురువారం ఎరుపెక్కాయి. మోడి విధానాలను నిరసిస్తూ, రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో సిపిఐ పాదయాత్ర నిర్వహించింది. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు నేతృత్వంలోని బృందం రోటరీనగర్ సిపిఐ కార్యాలయం నుండి ప్రారంభమై రోటరీ నగర్, ఇందిరానగర్ ద్వారా జెడ్పి సెంటర్ కు చేరుకున్నది. జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేతృత్వంలో నయాబజార్ కళాశాల నుండి ప్రారంభమై పాదయాత్ర కాల్వఒడ్డు, గాంధీ చౌక్, కమాన్ బజార్ పాత మున్సిపాలిటీ, శుక్రవారపు పేట మీదుగా జడ్పి సెంటర్ కు చేరుకున్నది. జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి నేతృత్వంలో అల్లీపురం క్రాస్రోడ్ నుండి ప్రారంభమైన ప్రదర్శన సంబానీనగర్, ముస్తాఫానగర్, బోనకల్ రోడ్డు మీదుగా జడ్పి సెంటర్ కు చేరుకొని, అక్కడి నుండి మహాప్రదర్శన ప్రారంభమైంది. వందలామంది డప్పు కొలాట దళాలు ముందు నడవగా ఎర్రదండు వైరారోడ్ లో కదం తొక్కింది. పాతబస్టాండ్, మయూరి సెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రం వరకు సాగింది. పాదయాత్రకు పలువురు సంఘీభావం తెలిపారు. మమత ఆసుపత్రి వద్ద డాక్టర్ బాగం కిషన్ రావు సిహెచ్ సత్యనారాయణరెడ్డి పాదయాత్ర బృందానికి పూలమాలలు వేసి సత్కరించారు. వైరా రోడ్లో డాక్టర్ గోర్కి ఆసుపత్రి సిబ్బంది ఏలూరి కృష్ణప్రసాద్ నేతృత్వంలో పాదయాత్ర బృందానికి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. జమ్మిబండ సమీపంలో గల పోటు ప్రసాద్ స్మారక స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని జమ్ముల జితేందర్ రెడ్డి ఆవిష్కరించగా, షేక్ జానిమియా, కొండపర్తి గోవిందరావు, బిజి క్లైమెంట్, మల్లేష్, వరద నరసింహరావు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

